పంట రుణంపై కూటమి విషం

- కూటమి ఫ్రీ హోల్డ్ పేరిట అడ్డంకులు
- ఆన్‌లైన్‌లో అందని అడంగల్ ఫారం
- క్రాప్‌లోన్ రెన్యూవల్ అడంగల తప్పనిసరి
- రుణం చెల్లించలేక రైతుల అవస్థలు

గడివేములకు చెందిన మహిళా రైతు బజంత్రి లక్ష్మిదేవి బ్యాంకులో రూ.2 లక్షలు పంట రుణం తీసుకుంది. ఏటా మాదిరిగి ఈసారి కూడా బ్యాంకర్లు రెన్యూవల్ చేయించుకోవాలని ఫోన్ చేయడంతో ఆమె బ్యాంకు వద్దకు వెళ్లింది. బ్యాంకర్లు 1బీ, అడంగల్ తీసుకురమ్మని చెప్పడంతో మీ–సేవ కేంద్రం వద్దకు వెళ్లింది. డిజిటల్ సమస్యతో అడంగల్ రావడం లేదని కేంద్రం నిర్వాహకులు చెప్పడంతో అదే విషయాన్ని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి చెప్పింది. వారు.. పంటసాగు చేసిన భూమి ఫ్రీహోల్డ్‌లో ఉందని, అడంగల్ రాదని చెప్పి, జేసీకి ఫిర్యాదు చేయాలని ఉచిత సలహా ఇచ్చి పంపారు. రెన్యూవల్ ఎలా చేయించుకోవాలతో ఆ మహిళా రైతు దిక్కుతోచని స్థితిలో ఉంది. – గడివేముల

కూటమి ప్రభుత్వం పేద రైతులను పీడిస్తోంది. ఫ్రీహోల్డ్ పేరిట పేదల భూములపై విషం కక్కింది. తద్వారా ఆన్‌లైన్‌లో 1బీ, అడంగల్ చిక్కని పరిస్థితి దాపురిచింది. క్రాప్‌లోన్ (పంట రుణం) రెన్యూవల్‌కు బ్రేకులు పడింది. వన్‌బీ, అడంగల్ లేకుండా బ్యాంకర్లు రెన్యూవల్ చేయాలేమని తెగేసి చెబుతున్నారు. సవాలక్ష ఆంక్షలతో రైతులు రుణం పొందేందుకు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు 8 వేల ఎకరాల దాకా డీకేటీ భూములున్నాయి. ఇందులో 23 వేల ఎకరాల దాకా పట్టా పాసు పుస్తకాలున్నాయి. ఈ భూములను నమ్ముకుని పేద రైతులు బతుకు జీవనం సాగిస్తున్నారు. పంట సాగు అవసరాల నిమిత్తం చాలా మంది రైతులు బ్యాంకులో పట్టా పాసుపుస్తకాలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుంటుంటారు. కొందరు ఈ రుణాలను ఏడాదిలోనే చెల్లించేస్తుంటారు. మరికొందరు ఏటా రెన్యూవల్ చేయించుకుంటారు.

రెన్యూవల్‌కు కష్టం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీకేటీ భూములు కలిగిన వారికి సర్వహక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంది. భూ అనుభవ కాలాన్ని అర్హతగా ఎంపిక చేసి ఈ ప్రక్రియ అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే కూటమి ప్రభుత్వం పేద రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఆ ప్రక్రియను నిలుపుదల చేయించింది. దీంతో ఆ భూములన్నీ కూడా ఫ్రీహోల్డ్ ఉన్నాయి. ఈ కారణంగా మీసేవ, సచివాలయాల్లో ఆ భూములకు సంబంధించిన సర్వే నంబర్ల ఆధారంగా 1బీ, అడంగల్‌కు దరఖాస్తు చేసుకుంటే రావడం లేదు. ఇవి రాకపోవడంతో పలు పథకాలు చేజారుతున్నాయి. పంట రుణాలు తీసుకున్న పేద రైతులు ఇబ్బంది పడుతున్నారు. 1బీ, అడంగల్ లేని కారణంగా బ్యాంకర్లు రెన్యూవల్ చేయనంటున్నారు. వడ్డీతో సహా రుణం చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక తికమక పడిపోతున్నారు. వడ్డీ కట్టించి రెన్యూవల్ చేయించుకోమని రైతులు ప్రాధేయపడినా వారు మాత్రం అంగీకరించడం లేదు. తీసుకున్న పంట రుణాలపై ఏడాది దాటితే అధికంగా వడ్డీలు పడే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారలు స్పందించి పేద రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


బ్యాంకులో గత ఏడాది రుణం తీసుకుని సాగు చేసిన మొక్కజొన్న పంట (ఫైల్)

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సి.బెళగల్: మండలం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ సుకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రకటనలో పేర్కొంటూ.. మండలంలోని ఐదు 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణ, మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. అలాగే కొత్తకోట, సి.బెళగల్, గుండ్రేవుల, పోలకల్, బురాన్‌దొడ్డి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

సాగు వివరాలు నమోదు చేయాలి

పాణ్యం: ఖరీఫ్‌కు సంబంధించి త్వరలో ప్రారంభమయ్యే సాగు వివరాలను ఆయా గ్రామాల వ్యవసాయ ఇబ్బంది తప్పకుండా ఫీల్డ్‌కు వెళ్లి పక్కాగా నమోదు చేయాలని ఏఓ జయప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. శుక్రంవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఖరీఫ్ లక్ష్యాలకు సంబంధించి వివరాలను నమోదు చేశామని, పంటల వారీగా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.

క్లుప్తంగా

ఆసుపత్రి గేటు వద్ద ట్రాఫిక్ నియంత్రించాలి


ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌కు వినతి పత్రం ఇస్తున్న సాయిప్రదీప్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్ గేటు వద్ద ట్రాఫిక్‌ను నియంత్రించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పిటి.సాయిప్రదీప్ శుక్రవారం ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద రద్దీగా ఉంటోందని, ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రి గేటు వద్ద ట్రాఫిక్‌తో మరింత ఇబ్బందులు ఉన్నాయన్నారు. గేటు ముందు ఆటోలు, వ్యాపారులు అడ్డంగా ఉండటంతో లోపలికి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంటోందన్నారు. ఈ మేరకు గేటు ముందు ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న విజయ రామాంజనేయులు

కర్నూలు(సెంట్రల్): జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి విజయరామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం సుర్జీత్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, రవాణా శాఖ కార్యాలయాలను ప్రైవేట్‌కు అప్పగించరాదన్నారు. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయరాదన్నారు.సెన్సార్ ఫిట్‌నెస్ ట్రాకులను వెంటనే రద్దు చేయాలన్న ఉద్దేశంతో చేపట్టే జాతీయ సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఆటో కార్మికులను కోరారు. కార్యక్రమంలో నాగరాజు, రవి. పి.మహ్మద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు



గాయపడిన మల్లికార్జున, పరశప్ప


ఆదోని అర్బన్: ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆర్పేందుకు వెళ్లిన ఇద్దరికి శుక్రవారం గాయాలయ్యాయి. బాధితులు, ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లికార్జున, పరశప్ప గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు వెళ్లగా విద్యుత్‌షాక్‌కు గురై గాయాలపాలయ్యారు. స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


జేఎం తండాలో బిందెల్లో నిల్వ చేసిన బెల్లం ఊటను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తుగ్గలి : జిల్లా ఏఈఎస్ ఈఎస్‌టీఎఫ్ అధికారి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పత్తికొండ సీఐ సువర్ణలత, ఎస్‌ఐ సాయిప్రవీణ్, సిబ్బంది శుక్రవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. పత్తికొండ మండలం జేఎం తండాలో 1,150 లీటర్ల బెల్లం ఊట, తుగ్గలి మండలం లక్ష్మితండాలో 450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. ఈ మేరకు ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరాముడు, ఎస్‌ఐ తేజ పాల్గొన్నారు.

వేలంలో రూ.8.69 లక్షల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

నందవరం: గురజాల రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం ఈఓ రాంప్రసాద్, పర్యవేక్షణ అధికారి సాయి ఆధ్వర్యంలో ఆలయ భూములకు వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు పరమేష్, ఈశ్వరరెడ్డి, యల్లప్ప, హనుమంతు, రాముడు, జయరాముడు, నరసింహులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. హనుమంతు, యల్లప్ప, రాముడు, జయరాముడు, పరమేష్, ఈశ్వరరెడ్డి హెచ్చుగా పాడి ఆలయ భూములను కౌలుకు దక్కించుకున్నారు. గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు సంబంధించి 94.26 ఎకరాలకు వేలం నిర్వహించగా రూ.8.69 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, శివారెడ్డి, రాజేష్‌రెడ్డి, చిన్న నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి


మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి ఐశ్వర్యరెడ్డి

పాణ్యం: విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని నంద్యాల జిల్లా రవాణాశాఖ అధికారి ఐశ్వర్యరెడ్డి సూచించారు. స్థానిక ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రయివేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించి బస్సులను నడపాలన్నారు. బ్రేకులు, హారన్, లైట్లు, టైర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. డ్రైవర్లు చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్తా మాట్లాడుతూ బస్సుల్లో సీసీ కెమెరాలు, మిర్రర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి వాహనానికి ఒక అటెండర్ తప్పకుండా ఉండాలన్నారు. బస్సులు కండీషన్‌లో ఉండేలా పాఠశాల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి బస్సు పనితీరును పరీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ శ్రీకాంత్, డీస్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: ఉపాధి హామి పథకంలో దాదాపు మూడు నెలల నుంచి పెండింగ్‌లో వున్న బిల్లులను తక్షణమే చెల్లించి, ప్రతి కూలీ కుటుంబానికి సలిక, పారా, పికాషితో పాటు, గంపలను సరఫరా చేయాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూలీలకు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమేగాక ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని నాగన్న ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, వెంకటస్వామి, దానమయ్య, ప్రదీప్, దేవపాల్, సరోజమ్మ, చిట్టెమ్మ, సువర్ణమ్మ, పుల్లయ్య, నాగమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బొలెరో ఢీ

- ముగ్గురికి గాయాలు
- బస్సు డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం


పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు


కంపచెట్లలోకి దూసుకెళ్లిన బొలేరో వాహనం

కోడుమూరు రూరల్: ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం కర్నూలు రోడ్డులోని మార్కాపురం బస్ స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు.. ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి ప్రయాణికులతో ఎమ్మిగనూరు బయలుదేరింది. ఇదే సమయంలో మార్కాపురం గ్రామం నుంచి కర్నూలు వైపు వెళ్లేందుకు బొలెరో వాహనం సడన్‌గా రోడ్డుపైకి వచ్చింది. అయితే బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వేగాన్ని అదుపు చేస్తూ బొలెరోను ఢీకొనకుండా తప్పించే ప్రయత్నంలో బస్సును పొలాల్లోకి తీసుకెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే రెండు వాహనాలు కొద్దిగా ఢీకొనడంతో బొలెరో డ్రైవర్ సంగల్ సాహెబ్‌కు రక్తగాయాలవ్వగా, బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరికి కడ్డీలు తగులుకొని స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.


మండల సమగ్రాభివృద్ధికి కృషి


సి.బెళగల్‌లో మండల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రమణారెడ్డి

సి.బెళగల్: మండల సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఆదోని డీఎల్‌డీఓ రమణారెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి ఆయా శాఖల మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల నుంచి నివేదికలు తీసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం చేపడుతున్న పనులు, వాటి పురోగతిపై చర్చించారు. కాగా గ్రామాల్లో మంచి నీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, గృహ నిర్మాణాలలో పురోగతి ఉండేలా చూడాలని హౌసింగ్ ఏఈ సుమంత్, హార్టికల్చర్ పంటల సాగులో భాగంగా మండలానికి కేటాయించిన 200 ఎకరాల సాగుపై దృష్టి సారించాలని ఉపాధిహామీ ఏపీఓ రామన్నను ఆదేశించారు. ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు సమగ్ర సమాచారం ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. ఆర్‌ఐ తరుణ్, విద్యుత్ ఏఈ సుకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి, పశువైద్యులు రిచర్డ్స్, ఉపాధిహామీ ఈసీ రంగస్వామి, వెలుగు ఏపీఎం రామేశ్వర్ తదితరులు ఉన్నారు.

క్షయ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: గ్రామాల్లో ఉచితంగా నిర్వహిస్తున్న క్షయ వ్యాధి (టీబీ) పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంచార వైద్య సేవల జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సి.బెళగల్‌లో పీహెచ్‌సీ డాక్టర్ సునీత, వైద్య సిబ్బందితో డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర అవగాహన ర్యాలీ, టీబీ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు గ్రామ ప్రజలతో మాట్లాడారు. టీబీ పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యం, ఆర్థిక సహాయం అందిస్తామని, ప్రజలు పరీక్షలకు ముందుకు రావాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీలో టీబీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని, 60 సంవత్సరాల వయస్సు పైబడి, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలున్న 23 మందికి గళ్ల పరీక్షలు నిర్వహించి, టీబీని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలల పాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 చొప్పున అందించనున్నట్లు టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర తెలియజేశారు. హెల్త్ ఎడ్యూకేటర్ పుష్పావతి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రభావతి, ఏఎన్‌ఎం పుష్పలత, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సి.బెళగల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం




సమస్యలను సభ దృష్టికి తెస్తున్న ఎంపీటీసీ సభ్యుడు పద్మనాభరెడ్డి, మాట్లాడుతున్న ఎంపీపీ తిప్పన్న, చిత్రంలో ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు

ఓర్వకల్లు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన సమావేశానికి 50 శాతం మంది అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీడీఓ శ్రీనివాసులు మండిపడ్డారు. పలు శాఖలకు చెందిన అధికారుల పనితీరుపై ప్రజా ప్రతినిధులు నిలదీశారు. అధికారులు మాత్రం ప్రగతి నివేదికలను వివరించి సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గుట్టపాడు గ్రామంలో తన అనుమతి లేనిదే పైపులైన్ నిర్మించడంతో, వృథాగా మారాయని సర్పంచు మోహన్ రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు శ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీదివేముల, ఉయ్యాలవాడ, సోమయాజులపల్లె గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై మండల ఉపాధ్యక్షులు పద్మనాభరెడ్డి అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీధి దీపాల కోసం 50–60 ఏళ్ల క్రితం నిర్మించిన విద్యుత్ స్తంభాలు చెక్కుచెదరలేదని, అలాంటిది ప్రస్తుతం 5, 6 ఏళ్ల క్రితం నిర్మించిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం నాణ్యతలో డొల్లతనాన్ని చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 1:15 చొప్పున ఉపాధ్యాయులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం టీచర్ల బదిలీలు ఉన్నందున పిల్లలు బడికి రావడంలేదని, వచ్చే వారం నుంచి పూర్తి స్థాయిలో బడికి వస్తే, అందరికీ కిట్లను అందజేస్తామన్నారు. విద్యాకిట్లు, మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు విద్యాశాఖ అధికారులను నిలదీశారు. కన్నమడకల గ్రామంలో అధికారులు ఎస్టిమేషన్ వేయనందున సామూహిక మరుగు దొడ్డి నిర్మాణ పనులు నిలిచిపోయాయని, దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచు తిక్కలి కాశిమన్న సభా దృష్టికి తెచ్చారు. త్వరలో ఎస్టిమేషన్ వేసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు సమాధానమిచ్చారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇకమీదట జరిగే సమావేశాలకు అధికారులు వంద శాతం హాజరుకావాలన్నారు. సమావేశంలో రీ సర్వే డీటీ శర్మిలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను అంతమొందించాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వంతో పాటు ప్రజలు సైతం సహకరించి సమాజం నుంచి మలేరియా వ్యాధిని అంతమొందించాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి కోరారు. శుక్రవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని నేతాజీ నగర్‌లో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. మలేరియా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రైడే నిర్వహించి దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమల పెరుగుదలను అరికట్టాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త కిరణ్, శైలజ, ఆశా కార్యకర్త వెంకటేశ్వరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: మిడుతూరు మండలం చౌటుకూరు గ్రామానికి చెందిన విశ్వనాథ్ (23) పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయన కొంతకాలంగా ఒమేగా హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన అనారోగ్య సమస్యతో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గుర్తించి ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

నేడు పాణి హాటి చిడాదహి మహోత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం పాణి హాటి చిడాదహి మహోత్సవం నిర్వహించనున్నట్లు కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవ ప్రభు పేర్కొన్నారు. నగర శివారులోని పాత జగన్నాథగట్టులోని జగన్నాథ స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. కీర్తన, అభిషేకం, తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రూపేశ్వర చైతన్య ప్రభుజీచే ప్రత్యేక ప్రవచనం ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కర్నూలు ఇస్కాన్ ఆలయం నుంచి బస్సులు బయలుదేరుతాయని వెల్లడించారు.

అవినీతిపై విచారణ జరపాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న శుక్రవారం డీఆర్‌ఓ. వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. 2019–2024 సంవత్సరాలకు సంబంధించి ఆడిట్ జరుగుతున్న సందర్భంగా కార్యాలయంలో కొందరు సిబ్బంది పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు చంటి, ఖాసీం, శరత్‌కుమార్ ఉన్నారు.

కాలువ కాదు.. రహదారే!



నీటి నిల్వతో కాలువను తలపిస్తున్న కరిమద్దెల ప్రధాన రహదారి

గడివేముల మండలం కరిమద్దెల గ్రామంలో చిన్నపాటి వర్షానికే రహదారులు కాలువలుగా మారుతున్నాయి. మురుగు కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే వర్షపు నీరు నిలిచి కాలువలను తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. చిన్నారులు, వృద్ధుల పరిస్థితి మరింత తారుణంగా ఉంది. వారు అడుగు తీసి అడుగు వేయాలంటేనే ఎక్కడే జారి పడతామేమోనని భయాందోళనకు గురవుతున్నారు. మురుగు కాలువలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – గడివేముల

జొన్నగిరిలో చోరీ

తుగ్గలి : తాళం వేసిన ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని జొన్నగిరి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పార్థయ్యశెట్టి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 11న మంత్రాలయం పుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. మంత్రాలయం నుంచి తిరిగి 12న రాత్రి ఇంటికి వచ్చిన పార్థయ్య..బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. అయితే చోరీ ఎంత జరిగిందనేది స్పష్టత రాలేదు. చోరీ విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, జొన్నగిరి ఎస్‌ఐ మల్లికార్జున శుక్రవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

యోగా ప్రదర్శనను విజయవంతం చేయండి


సి.బెళగల్‌లో యోగా వేదిక వద్ద ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలో శనివారం ఆయా గ్రామాల్లో నిర్వహించనున్న యోగా రిహార్సల్స్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఆదోని డివిజన్ డీఎల్‌డీఓ రమణారెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ వెంకటలక్ష్మితో కలిసి సి.బెళగల్‌లో యోగా రిహార్సల్స్ నిర్వహించే వేదికలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు, శిక్షకుల వివరాలను తెలుసుకున్నారు. అదేవిధంగా భార్గవ రాయల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేదికను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఏ వేదికలో ఎవరు శిక్షణ ఇస్తారు, వారికి అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణిని ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణపై ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని తహసీల్దార్‌ను హెచ్చరించారు. ఆర్‌ఐ తరుణ్, వీఆర్వోలు గౌరి, వెంకటేష్, సాయిరమణ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వీఆర్‌ఏలు తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఖరీఫ్ సీజన్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ), ఎంపీఈఓలు గ్రామాలలో రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్లలో రైతులకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పథకాలను, సబ్సిడీ అంశాలను రైతులకు తెలియజేసి, వ్యవసాయ సహాలు సూచనలు అందజేయాలని, పంట విత్తడం, సస్యరక్షణ పద్ధతులను ఎప్పటికప్పుడు రైతాంగానికి తెలియజేప్పాలని ఏఓ సూచించారు. అదేవిధంగా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మందులపై అవగాహన కల్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా అర్హుల ఈ–కేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. రైతుల మరణాలపై సమగ్ర సమాచారం అందజేయాలని, అర్హులకు లబ్ధి చేకూరేలా చూడాల్సిన బాధ్యత వీఏఏలదే అని అన్నారు. ఏఈఓ హిమబిందు, ఎంపీఈఓలు, వీఏఏలు ఉన్నారు.